కల్యాణం.. కమనీయం

కనుల పండువగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



- వైభవంగా భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణం
- పెద్ద ఎత్తున హాజరైన శివరాత్రి దీక్షలో ఉన్న భక్తులు
- కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించిన ఆలయాల నిర్వాహకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి పంచామృతాభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం భక్తులు ఉపవాసదీక్షను విరమించి ఆలయంలో అన్నదానం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అభినవ దండ శ్రీవిద్యాశంకర భారతీస్వామి ఆశీస్సులు పొందుతున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆలయ కమిటీ సభ్యులు

బాలానగర్‌లో చతుర్దశ బ్రహ్మోత్సవాలు...

బాలానగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో శనివారం చతుర్దశ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. జగద్గిరి–పుష్పగిరి శంకరాచార్యులు, అభినవ దండ శ్రీవిద్యా శంకర భారతిస్వామి పర్యవేక్షణలో స్వామివారి కల్యాణ వేడుక జరిగింది. ఈ కల్యాణోత్సవంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ వేడుకలో ఆలయ అధ్యక్షుడు గడ్డం సీతారామరెడ్డి, జనరల్ సెక్రటరీ చిలుకూరు హరిచందు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఏకాంబరేశ్వర శివాలయానికి పట్టువస్త్రాల సమర్పణ

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ 3వ రోడ్డులోని ఏకాంబరేశ్వర శివాలయంలో ఆలయ చైర్మన్ రమణ ఆధ్వర్యంలో మహా శివరాత్రి వేడుకలను కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల పాండు రంగారావు, కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికి మహా శివ రాత్రి శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వరుడు ఆశీస్సులతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు. తన సోదరుడు ఆలయ చైర్మన్ రమణ ఇంత అంగరంగ వైభవంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు జరపటం, కొన్ని వేలమంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పండుగ నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ కొండల్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నం.3లోని శివాలయ పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ రమణ, గొట్టిముక్కల పాండురంగారావు, సీఐ వెంకటేశ్వరరావు



భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం



◆ హరిహర క్షేత్రంలో శివపార్వతుల కల్యాణం...

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ హరిహర క్షేత్రంలో శివరాత్రి మహోత్సవం సందర్భంగా శనివారం తెల్లవారుజామున కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణసూరి సమక్షంలో శివపార్వతుల కల్యాణం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శనివారం ఉదయం నిత్యాభిషేకం, రుద్రహోమం వంటి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. శివరాత్రి జాగరణ సందర్భంగా భక్తులు వందలాదిగా ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు శివనామస్మరణతో మార్మోగాయి.



ఆల్విన్‌కాలనీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి, పాల్గొన్న భక్తులు

సొంత గూడు సాకారమయ్యేనా..?

- సీఎం ప్రకటనతో దరఖాస్తు దారుల్లో ఆశలు
- మేడ్చల్ జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు 1.10 లక్షలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసింది. మిగతా రెండు గ్యారెంటీల్లో ఒకటైనా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సంబంధిత అధికారులను ఆదేశించిన నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనుండటంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు రానుండటంతో దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీల్లో 8 రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలపై అర్హులైన ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున 7.09 లక్షల దరఖాస్తులు రాగా, అందులో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి 1,10,226 మంది దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి ఇళ్ల నిర్మాణం కోసం మంజూరు పత్రాలు అందిస్తారు. సొంత స్థలం ఉన్నవాళ్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నచ్చిన రీతిలో నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

ఏళ్లుగా ఎదురుచూపులు..

జీవిత కాలంలో సొంతగా ఇంటిని నిర్మించుకోగలమా అన్న ఆశతో జిల్లాలో వేలాది మంది నిరుపేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో ఇంటి నిర్మాణం కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పేరుతో నిర్మాణాలు చేపట్టినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో నిరు పేదల కలలు సాకారం కానున్నాయి.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



లబ్ధిదారుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీకి చెందిన చంద్రమౌళి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ఇందుకు సంబంధించిన చెక్కును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటోందని.. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాచర్ల భద్రయ్య, రమేష్‌పటేల్, తిరుపతి రెడ్డి, కాశీనాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

మోతీనగర్: టెక్ మహీంద్ర ఫౌండేషన్, నియాక ర్సర్ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో ఈ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్, ఇన్‌స్రూ ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, టాలీ, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన అభ్యర్థులకు ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులన్నారు. ఈనెల 15 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఫోన్ నం.77995 94242, 77996 94242లో సంప్రదించగలరు. దరఖాస్తు చేసుకోవటానికి ఆఖరి తేదీ మార్చి 13 అని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఉచిత శిక్షణపై ప్రచారం నిర్వహిస్తున్న నిర్వాహకులు

క్రికెట్ టోర్నమెంట్ విజేత సెవన్‌స్టార్ టీమ్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, ఉదయ్ ముదిరాజ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ పార్కులో ప్రతి సంవత్సరం శివరాత్రి మహా పర్వదినం పురస్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉదయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ హాజరై టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. అనంతరం విజేతలైన సనత్‌నగర్ సెవన్‌స్టార్ టీంకు మొదటి బహుమతి కప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్ గౌడ్, తేజ, శేఖర్, గట్ల రవీంద్రనాథ్‌గౌడ్, రోహిత్, రాకేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల కరస్పాండెంట్‌ల అసోసియేషన్ నూతన కమిటీ

మూసాపేట: కూకట్‌పల్లి మండల తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్‌ల అసోసియేషన్ ఎన్నికలు శనివారం జరిగాయి. కూకట్‌పల్లిలోని భారత వికాస్ పరిషత్ వికలాంగుల భవనంలో సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నికల ద్వారా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు నాగార్జున విద్యాలయం కరస్పాండెంట్ జె. కమలాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి గీతాంజలి మోడల్ స్కూల్ కరస్పాండెంట్ రవిబాబు, కోశాధికారి ఆర్ఆర్ విద్యాభవన్ కరస్పాండెంట్ ఎం. సుబ్రహ్మణ్యంలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వి. రామకృష్ణరావు, ఎన్నికల పరిశీలకులుగా ఇన్నారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ.. తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశీలించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచశీల స్కూల్ కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నూతన అసోసియేషన్ కమిటీ సభ్యులు

రేపు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: రితన్య అడ్వాన్స్‌డ్ ఆర్థో అండ్ న్యూరో కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అల్లాపూర్, గాయత్రినగర్ చౌరస్తా వద్ద డీఎం డయాగ్నస్టిక్ క్లినిక్ పక్కన ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో డా. కరుణాకర్ కొల్లా ఆధ్వర్యంలో మోకాలు, తల, మెడ, నడుము, భుజాలా నొప్పులు, అన్ని రకాల దీర్ఘకాలిక నొప్పులు, మడమ నొప్పి, నరాల సమస్యలు, సయాటికా వంటి వాటికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవిష్యనిధి అదాలత్ రేపు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వీవీ టొంగ్లీకర్ తెలిపారు. ఈనెల 11వ తేదీ ఉదయం 11గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో అదాలత్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవటమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ప్రాంత ఖాతాదారులు పాల్గొనవచ్చన్నారు.

సింగర్ సుక్వీందర్ సింగ్ లైవ్‌షో 24న

మాదాపూర్: నగరంలోని అజీజ్‌నగర్‌లో గల రాన్‌చోడే కాబలోస్ వద్ద ఈ నెల 24వ తేదీన లైవ్‌షోను ఏర్పాటు చేయనున్నట్లు సింగర్ సుక్వీందర్ సింగ్ తెలిపారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో శనివారం అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శ్రేయస్ గ్రూప్ బిజ్‌బాష్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో లైవ్‌షోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం లైవ్‌షో బ్రోచర్‌ను విడదల చేశారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల కృతజ్ఞతాభినందన సభ

పంజగుట్ట: ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో చేర్చి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతాభినందన సభ రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ సి.హెచ్.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ ఆదివారం (నేడు) ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆయన మాట్లాడుతూ... సమావేశానికి రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలల్లో పని చేస్తున్న 1940 మంది గెస్ట్ లెక్చరర్స్ హాజరౌతారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి, గాలిరెడ్డి హర్షవర్ధన్‌లు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జెడ్‌సీ అభిలాష అభినవ్, ఉద్యోగులు, కార్మికులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్‌సీ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళలు కూడా ఆయా రంగాల్లో ఉన్నతంగా ఉండాలని సూచించారు. మహిళలు తమ కష్టాలకు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా పోరాడి సాధించుకోవాలని సూచించారు. ఈ రోజుల్లో మహిళలకు ఆర్థికంగా, రాజకీయంగా, వ్యాపారం రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు.

◆ అనంతరం మహిళా ఉద్యోగులు, కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా ఉద్యోగుల కోసం శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషన్‌ను టాయిలెట్‌ల వద్ద ప్రారంభించారు. మహిళా ఉద్యోగుల వ్యక్తిగత పరిశుభ్రతకు ఈ మిషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యాలయంలో కూడా వెండింగ్ మిషిన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉమాదేవి, హేమభాను, శ్రీకాంత్ రెడ్డి, డా. సాల్మన్‌రాజ్, రూపాదేవి, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను శనివారం కూల్చివేశారు. కేపీహెచ్‌బీ రోడ్డు నెం 1, 2, 4లోని అక్రమ నిర్మాణాలను ఎస్‌టీఎఫ్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కేపీహెచ్‌బీలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు కూల్చివేసినట్లు తెలిపారు.



కేపీహెచ్‌బీ రోడ్‌నం.2లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చేసిన ఎస్‌టీఎఫ్ సిబ్బంది

పీఆర్సీ ప్రకటనతో ఆర్టీసీ కార్మికుల హర్షం

మూసాపేట: ఎన్నో సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికులు ఎదురు చూస్తున్న 2017కు సంబంధించిన పీఆర్సీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినందుకు ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఇతర పెండింగ్ బకాయిల సమస్యలు కూడా పరిష్కరించాలని ఆయన కోరారు.

బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



తప్పిపోయిన బాలుడితో అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఐ సామల వెంకటరెడ్డి, పోలీసులు

మోతీనగర్: తప్పిపోయిన చిన్నారిని పోలీసులు గంట వ్యవధిలో ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. శ్రీ వివేకానందనగర్‌లో నివాసముంటున్న బనావత్ కుమారుడు కమల్‌నాథ్ సింగ్ (7) ఉదయం 7 గంటలకు ఆడుకోవటానికి ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు వెదికినా చిన్నారి ఆచూకి లభించలేదు. దీంతో చిన్నారి తండ్రి బనావత్ అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కూకట్‌పల్లి ఏసిపి శ్రీనివాస్ ఆదేశాల మేరకు అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి ఆ ప్రాంతమంతా వెతికారు. దీంతో గాయత్రినగర్‌లోని హరిహర దేవాలయం వద్ద ఆ బాలుడి ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ కనిపెట్టిన పోలీసులకు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

లిబర్టీ: రాష్ట్ర ప్రగతి కోసం ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రజా పాలన అందిస్తుందని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధి నిరూపించుకుందని పేర్కొన్నారు. లిబర్టీ ప్లాజాలోని జన సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిగా మార్చిందని, ప్రభుత్వం నడపడానికి కష్టంగా ఉందన్నా అయినా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజాహితం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటనారాయణ మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రభుత్వం నిర్దిష్ట గడువులో అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

విదేశీ విద్యపై అవగాహన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని హయత్ ప్లేస్ హోటల్‌లో శనివారం ది గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2024ను నిర్వహించారు. గ్లోబల్ ట్రీ సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఇందులో పాల్గొని తమ సంస్థల్లో విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ఫెయిర్‌ను మాజీ మంత్రి మల్లారెడ్డి, సీబీఐటీ ప్రొఫెసర్ ఎస్‌ఎల్‌ఎస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ నర్సింహులు ప్రారంభించారు. గ్లోబల్ ట్రీ, మల్లారెడ్డి యూనివర్శిటీలు పరస్పర సహకారం అందిస్తున్నాయన్నారు. యూకే, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, యూరప్ తదితర దేశాలకు చెందిన 50 యూనివర్శిటీలు ఇందులో పాలుపంచుకున్నాయి.

అన్ని పార్టీలు బీసీలకు సీట్లు కేటాయించాలి

లిబర్టీ: అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సముచితమైన లోక్‌సభ సీట్లు కేటాయించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. రాజకీయంగా వెనుకబడిన బీసీ కులాలకు రాజకీయంగా మరింత పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ భారతీయ రాష్ట్ర సమితి బీజేపీ తదితర పార్టీలు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీట్లు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీసీల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. అదే క్రమంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం ఏడు స్థానాలు కేటాయించి బీసీల మనస్సును దోచుకోవాలని కోరారు. బీసీ జనాభా ప్రకారం బీజేపీ, బీఆర్ఎస్ సముచితమైన టికెట్లు కేటాయించి బీసీల రాజకీయ అభివృద్ధికి తోడ్పడాలని విన్నవించారు.

భువనగిరి పార్లమెంట్ టికెట్ కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ టికెట్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించాలని ఓయూ జేఏసీ నాయకులు నరేందర్ పవార్ కోరారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా పనిచేస్తూ ఆయన గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేశారని ఆయన సేవలను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు అధిష్టానం గుర్తించి ఎంపీ టికెట్‌ను కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయిస్తే ఓయూ జేఏసీ తరఫున భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలి

కూకట్‌పల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఆవని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో గోదా కృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీతమహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నేడు మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని సూచించారు. మహిళలు సొంతంగా పరిశ్రమలు, కంపెనీలు స్థాపించి పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారన్నారు. భవిష్యత్‌లో మహిళలు మరింత ఎత్తుకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హఫీజ్‌పేట డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్, కూకట్‌పల్లి సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరావు, కూన సత్యంగౌడ్, డాక్టర్ జ్యోతిరెడ్డి, రాధిక యార్లగడ్డ, పద్మిని, మనెమ్మలు, మహిళలు పాల్గొన్నారు.

